అదును దాటినా...

- ఇంకా కొనసాగుతున్న ఖరీఫ్ వరి ఉబాలు
- సకాలంలో వర్షాలు కురవక పోవడంతో జాప్యం
- తాజాగా కురిసిన వర్షాలకు ' దమ్ములు పడుతున్న రైతులు
- ముదురు నారుతోనే ఉబాలు
- పంట దిగుబడిపై ఆందోళన


కొత్తశ్రీరంగ రాజపురం గ్రామంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

గజపతినగరం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నాట్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. వాస్తవానికి ఏటా ఖరీఫ్ వరి నాట్లు జూలై నెల రెండో వారా నికే ప్రారంభమై ఆగస్టు నెలాఖరు నాటికి దాదాపు పూర్తయ్యేవి. అయితే ఈఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధి మండలాల్లో వరినాట్లు సాధారణ సాగు విస్తీర్ణం కంటే తక్కువ స్థాయిలో పడ్డాయి. బోరుబావులు ఉన్న రైతులు మాత్రమే సమయానికి నాట్లు వేయగలిగారు. వర్షాలు ముఖం చాటేయడంతో వర్షాధారంగా సాగు చేసే రైతులు నాట్లు వేయలేకపోయారు. అల్పపీడన ప్రభావంతో తాజాగా వర్షాలు కురవ డంతో మూడు రోజులు నుంచి రైతులు దమ్ములు పడుతున్నారు. గజపతినగరం మండలంలోని పురిటిపెంట, బంగారమ్మపేట, పాతభగ్గాం, భూదేవిపేట, తమ్మారాయుడిపేట, గంగ చోళ్లపెంట,మధుపాడు, గుడివాడ, బొండపల్లి మండలంలోని నెలివాడ, బోడసింగిపేట, గొల్లుపాలెం, ముద్దూరు తదితర గ్రామాల్లో, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లోని పలు గ్రామాల్లోనూ రైతులు నాట్లు వేసే పనిలో బిజీగా ఉన్నారు. అయితే ఎప్పుడో జూన్‌లో వరి నారు పోయడంతో అది ముదురు పోయింది. గత్యంతరం లేక ఆ నారునే ప్రస్తుతం ఉడుస్తున్నా రు. సకాలంలో నాట్లు వేయకపోవడంతో పాటు ముదురు నారును ఉడుస్తుండడంతో పంట దిగుబడిపై రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్న రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు నారు నాటే వారు చిగుర్లు తుంచాలి. దగ్గరదగ్గరగా ఎక్కువ కుదుళ్లు నాటు కో వాలి. దమ్ములోనే ఎరువులు వేయాలి. ముందుగా నాట్లు పూర్తి చేసిన చోట తాజాగా కురిసిన వర్షాలకు తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. ఆకుముడత,పొడతెగులు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రొఫికొనజోల్ లేదా ఎసిపేట్ మందును పిచికారీ చేయాలి.

– కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం డివిజన్

గతేడాది కంటే తగ్గిన సాగు విస్తీర్ణం

గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం గతేడాది కంటే ఈ ఏడాది తగ్గిందని వ్యవసాయ అధికారులు చెబుతున్న గణాంకాలు తెలుపుతున్నాయి. గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో 2023 ఖరీఫ్‌లో 26,380 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణంగా అధికారులు లక్ష్యం పెట్టుకోగా 35,456 ఎకరాల్లో సాగు చేశారు.ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 34,131 ఎకరాలుగా అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు 28,739 ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి. గతేడాది లక్ష్యానికి మించి 9,076 ఎకరాల్లో వరిసాగు చేస్తే..ఈ ఏడాది లక్ష్యం కంటే 5,392 ఎకరాల సాగు తగ్గింది.

గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ వరి సాగు వివరాలు

2023లో...

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం	సాగు చేసింది
గజపతినగరం	7,360	9,549
బొండపల్లి	5,010	7,319
దత్తిరాజేరు	6,210	9,076
మెంటాడ	7,800	9,442

ఈ ఏడాది సాగు వివరాలు

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం	నాట్లు వేసిన విస్తీర్ణం
గజపతినగరం	9,201	7,600
బొండపల్లి	6,670	5,200
దత్తిరాజేరు	8,934	7,173
మెంటాడ	9,326	7,800

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లి: రాష్ట్ర స్థాయి 36వ సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలకు మండలంలోని పెద నడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక య్యారు. జిల్లా కేంద్రం విజయనగరంలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు కె.జశ్వంత్, కె.ఇందు, ఐ.దీపిక ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వీరు శ్రీకాకుళం జిల్లా, పలాస మండలంలోని వజ్రపు కొత్తూరు పాఠశాల ఆవరణలో శనివారం, ఆదివారాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు వెళ్లారని చెప్పారు. విద్యార్థులకు హెచ్‌ఎంతో పాటు పీడీ రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ


జామి ఎస్‌ఐ వీరజనార్ధనరావు

జామి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా వై.వీర జనార్ధనరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన వీరబాబుకు అల్లూరిసీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ అయ్యింది. నూతనంగా భాద్యతలు స్వీకరించిన ఎస్‌ఐ మాట్లాడు తూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేస్తానని తెలిపారు.

వల్లంపూడి ఎస్‌ఐగా దేవి


వల్లంపూడి ఎస్‌ఐ దేవి

వేపాడ: మండలంలోని వల్లంపూడి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బి.దేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఆంధ్ర పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు


క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన చీపురుపల్లి ఉపాధ్యాయుల జట్టుతో యూటీఎఫ్ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా గరివిడి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో చీపురుపల్లి నియోజకవర్గస్థాయి ఉపాధ్యాయులకు శనివారం క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో చీపురుపల్లి మండల ఉపాధ్యాయుల జట్టు విజేతగా నిలవగా, మెరకముడిదాం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్ పోటీల్లో మెరకముడిదాం జట్టు విజేతగా నిలవగా గరివిడి జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి సూరి శ్రీనివాసరావు, మెరకముడిదాం, గరివిడి, చీపురుపల్లి మండలాల ప్రతినిధులు ఎం.రఘునాథరాజు, రమేష్, చంద్రశేఖర్, సతీష్, లక్ష్మణ, సత్యనారాయణ, రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి..


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త మంగలక్ష్మి

వేపాడ: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగలక్ష్మి, రాజేశ్వరి, దేవి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు 1,2,3లో రక్తహీనతపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలికలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. చామలాపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త రాపర్తి నూకరత్నం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

వరద బాధితులకు సాయం


వరద బాధితులకు బియ్యం ప్యాకెట్‌లు అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

శృంగవరపుకోట: విజయవాడ వరద బాధితులకు ఎస్.కోట ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగులు, డిపో మేనేజర్ కె.రమేష్ నేతృత్వంలో సహాయం చేశారు. 1000 కిలోల బియ్యం కొనుగోలు చేసి, వాటిని బస్‌లో విజయవాడలోని ఆర్టీసీ అధికారులకు పంపించి బాధితులకు అందించాలని కోరారు. విజయవాడ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.వై.దానం, ట్రాఫిక్ మేనేజర్లు పండిట్‌నెహ్రూ బస్‌స్టేషన్‌లో ఉన్న అజిత్‌సింగ్‌నగర్ కు చెందిన పారుగు సేవల సిబ్బందికి శనివారం బియ్యం బస్తాలను అప్పగించగా, బాధితులకు పంపిణీ చేశారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం


చీపురుపల్లి: కేసులు రాజీ చేస్తున్న జడ్జి ప్రేమలత


శృంగవరపుకోట: లోక్‌అదాలత్‌లో వాదనలు వింటున్న జడ్జి వాణి


గజపతినగరం: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి కనకలక్ష్మి

చీపురుపల్లి: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఇరువర్గాలకు సత్వర న్యాయం లభిస్తుందని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత చెప్పారు. స్థానిక కోర్టు హాల్‌లో శని వారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 21 సివిల్, 32 క్రిమినల్, 516 సమ్మరీ ట్రైల్ కేసులను రాజీ చేశారు. జడ్జి మాట్లాడుతూ కోర్టుల చుట్టూ తిరగడం కంటే లోక్ అదాలత్‌లో రాజీపడి కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.లోక్‌అదాలత్ సభ్యులు భోగాపురపు శ్రీదేవి,సీనియర్ న్యాయవాది ఆర్. నాగ భూషణరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

633 కేసులు పరిష్కారం

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి బి.కనకలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం మెగాలోక్ అదాలత్ నిర్వ హించారు. సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మనోవర్తి తదితర 633 కేసులను రాజీమార్గంలో పరిష్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు పొట్నూరు శ్రీనివాసరావు, జె.జగదీష్, సీఐ జీ.ఏ.వి.రమణ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎస్.కోట కోర్టులో..

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి ఎస్.వాణి నేతృత్వంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. మొత్తం 375కేసులను రాజీ చేసినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి. 16 సివిల్,13చెక్ బౌన్స్, 2 మనోవర్తి, 344 క్రిమినల్ కేసులను పరిష్కరించారు. శృంగవరపుకోట న్యాయవాదుల సంఘం కక్షిదారులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్, పోలీస్, బ్యాంక్ అధికారులతో పాటు బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు న్యాయవాదులు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ బొత్సను కలిసిన నాయకులు


బొత్సను కలిసిన ఎస్.కోట వైఎస్సార్‌సీపీ నాయకులు

శృంగవరపుకోట: ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో జామి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు జి.రవి కుమార్, అల్లు మహాలక్ష్మినాయుడు, సాంబరాజు, దేవాపురపు సన్యాసిదేముడు, ఎస్.కనకం, వర్రి సత్యారావు, బొడ్డ వర బాబూరావు, తదితరులు శనివారం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతపై చర్చించారు.

'లైఫ్ స్కిల్స్'పై సెమినార్

శృంగవరపుకోట: పట్టణంలోని వివేకానంద విద్యాసంస్థల్లో లైఫ్‌స్కిల్స్ అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లైఫ్‌స్కిల్స్ ట్రైనర్ ఐసీటీ అకాడమీ నిర్వాహకుడు దినకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకాగ్రత, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం దినకర్‌రెడ్డిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వ్యవస్థాపకులు సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం. భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


చీపురుపల్లిరూరల్(గరివిడి): వెదుళ్లవలసలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సర్పంచ్ తమ్మినాయుడు, వైస్ ఎంపీపీ శ్రీరాములునాయుడు


చీపురుపల్లి: ఆకులపేటలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వేపాడ: వేపాడలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

చీపురుపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ఉత్సవ కమిటీలు శని వారం నిర్వహించాయి. ఆకులపేట, విజయకాలనీ, రామాంజనేయకాలనీ, శెగిడివీధి తదితర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ప్రారంభించారు.

వేపాడ మండలంలో..

వేపాడ: మండల కేంద్రంతో పాటు మండలంలోని వల్లంపూడి,నల్లబిల్లి తదితర గ్రామాల్లో వినాయక మండపాల వద్ద ఉత్సవ కమిటీలు అన్నదానం చేశాయి. వేపాడలో యూత్ అఫ్ యూనిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 2,500 మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

వెదుళ్లవలసలో...

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో వినాయక మండపం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు ప్రారంభించారు.

రైలు ప్రయాణాల్లో జాగ్రత్త...


పురిటిపెంటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రైల్వే ఇన్‌చార్జి ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్

గజపతినగరం: రైలు ప్రయాణం చేసేటప్పుడు దొంగతనాలు, దోపిడీలకు గురికాకుండా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని, సహాయం కోసం రైల్వే హెల్ప్ లైన్ నంబర్ 139ని సంప్రదించాలని బొబ్బిలి రైల్వే ఇన్‌చార్జి ఎస్‌ఐ ప్రదీప్ కుమార్ సూచించారు. మండలంలోని పురిటిపెంట గ్రామంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుట్‌పాత్‌పై కూర్చోకూడదన్నారు. వెళుతున్న రైళ్లపైకి రాళ్లు విసరడం, పట్టాలపై రాళ్లు అడ్డు పెట్టడం వంటి చర్యలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. బొబ్బిలి ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ డి.వి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత


మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని గరివిడి అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తలు ఎస్.సత్యం, ఆర్.శివ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులను సద్వినియోగించుకోండి


విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమైన ఉపాధ్యాయులు

వేపాడ: నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాలలో రోజూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎరుకునాయుడు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆంగ్ల బోధన తరగతులను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం రాత్రి బానాది గ్రామాన్ని సందర్శించారు. పాఠశాలలో కొత్తగా చేరిన పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రారంభ సమయానికి ముందుగా నిర్వహిస్తున్న ఆంగ్లబోధన తరగతులకు బానాది గ్రామ విద్యార్థులు తప్ప అంతా హాజరవుతున్నారన్నారని చెప్పారు. బడి బస్సులో రావడం వల్ల విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరుకాలేకపోతున్నారని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పిల్లలను పంపించాలని తల్లిదండ్రులను కోరారు.

రక్షణ కల్పించండి

వేపాడ: వేపాడ రూట్ బడిబస్సు డ్రైవర్లకు రక్షణ కల్పించాలని, లేకుంటే బస్సులు నడపలేమని వల్లంపూడి పోలీస్ స్టేషన్ ముందు డ్రైవర్లు శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా డ్రైవర్లు ఎస్.సతీష్,గణేష్, నాయుడు, రాజు, తదితరులు మాట్లాడుతూ శుక్రవారం బడి బస్సులో పిల్లలను స్కూల్‌కు తీసుకెళుతుండగా ఇద్దరు యువకులు బైక్ పై వచ్చి డ్రైవర్‌పై మూకుమ్మడి దాడి చేసి, చెవిపై రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. పోలీసులు స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలని కోరారు.